# ఊరేగింపు

తెల్లటి ఖద్దరు బట్టల, ఖరీదైన బట్టల ఊరేగింపు అది. ఎప్పుడూ కార్ల లోనే ప్లేనల్లోనే, ఫస్టుక్లాస్ కంపార్టుమెంట్లలోనే తప్ప పాదయాత్ర చెయ్యని వాళ్లు నిశ్శబ్దంగా ఊరేగింపులో .... ఉన్నారు.

వాళ్ళ సుకుమారమైన కాళ్ళ జోళ్ళు ఎక్కడ నొచ్చుకుంటాయోనని, అక్కడక్కడ కంకర తేలిన తన కరుకు తనం ఎంత బాధిస్తోందోనని - మరీ యిదయిపోయి ముఖమంతా మాడ్చుకున్నట్టుంది నల్లని తారురోడ్డు —

భక్తితో లాఠీలు ముడుచుకుని, అంగరక్షకుల్లా తలలు వంచుకుని, ఊరేగింపును గౌరవంగా తీసుకెళ్తున్నారు పోలీసులు ! !

నినాదాల్ని గొంతెత్తి అరవడం లేదు ఉరుము లేని మెరుపులాగ పోతోంది. సాగుతున్న గుంపు - రాజభవన్‌వైపు.

ఫ్యాక్టరీలల్లో తమ కోర్కెలు తీర్చగల - ప్రముఖ పారిశ్రామిక వేత్తల కేం కోరికలున్నాయోనని ఆశ్చర్యపోయి, ప్రక్కకు తొలగి దారి విడిచారు - కార్మికులు.

తమకేవో లేని పోనివి నేర్పుతూ వెనక నుండి ఎగవేసే, తెరవెనక నున్న రాజకీయ ధురంధరులు కూడా ఊరేగింపులో వుండి - విద్యార్థులకు ఆశ్చర్యాన్ని కలిగించారు.

తమ కోర్కెలు సఫలం చేయించడానికి తమ వైపు నిలబడతామని వాగ్దానం చేసిన ఆటో, టాక్సీ యూనియన్ల ప్రసిడెంట్లు - స్వయంగా తమ కోర్కెల కోసం ఊరేగింపులో పాల్గొనడం వల్ల, వాహనాలు ఆపి ప్రక్కకు నిలబడి అలాగే చూస్తుండి పొయ్యారు. టాక్సీడ్రైవర్లు .... ఆశ్చర్యంగా !

ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించి, సమస్యలకు సరైన పరిష్కారాలు వెతుకు తామనిచెప్పి, కన్నీళ్ళను వృధా చేయకండి. పంటకాలవలవైపు మళ్ళించి ఆహారోత్పత్తిని అధికం చేయండి. మీ కన్నీళ్ళకు ఆనకట్టలు కట్టిస్తాను దాని వల్ల మన రాష్ట్రానికి కావల్సినంతపోగా, విద్యుచ్ఛక్తిని మన ప్రక్క రాష్ట్రాలకు కూడా పంపొచ్చని, ఉపన్యసించిన (కొద్ది ఓట్లతో మంత్రిపదవి తప్పి పోయినా యిప్పటికీ ప్రజలవైపే వుండి, ప్రజల కోసం పాటుపడే) ప్రజా నాయకులు కూడా వారి కోర్కెలు తెలిపే మెమొరాండం సమర్పించి రావడానికి ఊరేగింపులో వెళ్తుండడం .... నిజానికి సామాన్యజనానికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"అలాగా ! యూనివర్సిటీ నుండి రెండు, మూడు డిగ్రీలు తీసుకున్నా నీకింకా ఉద్యోగం దొరక లేదా ! అవును దొరకడం మామూలా ఈ రోజుల్లో- ఫరవాలేదు నేనిప్పిస్తాను. అయ్యే ఖర్చులు నువ్వు పెట్టుకో" - రెండు నెలల్లో యిప్పిస్తానని రెండేళ్ళయినా యిప్పించక, ఖర్చులు మాత్రం భోంచేసిన పైరవికార్లు కూడా ఆ గుంపులో వెళుతూ వుండడం నిరుద్యోగులకు ఒళ్ళు మండినా, ఆశ్చర్యం కలిగించింది. అందరిలాగే వాళ్ళు ప్రక్కకు తొలగి దారిచ్చారు.

ధరలు కొంతవరకు పెంచినా, దొరకని వస్తువులు కూడా తమ నగరం లోని వాళ్లకు దొరికేట్టు చేస్తున్న వ్యాపారస్తులు ।

కొంత ఆలస్యమౌతున్నా, మంచి ముడిసరుకులు దొరక్క-పోవడం వల్ల నిర్మాణాలు కొంత పటిష్టంగా వుండక పోతున్నా - ప్రజల డబ్బును మంజూర్ల ద్వారా పుచ్చుకుని, ప్రజలకోసమే చేస్తున్న ప్రముఖ కంట్రాక్టర్లు కూడా ఊరేగింపులోనే - వున్నారు.

ప్రజల అభిమానాన్ని, బ్లాక్ మనీని చూరగొంటూ మరోవైపు పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారస్తులుగా తయారవుతున్న సుప్రసిద్ధ సినీ తారలు కూడా పాల్గొనడం - ప్రజలకు పిచ్చెత్తినట్లయింది ఇప్పుడు యుద్ధం కూడా ఏదీ లేదు కదా ! చిరునవ్వు లొలకబోస్తూ పరోక్షంగా బలవంతాన విరాళాలు వసూలుచేసే కార్యక్రమమైనా లేనిది, ఇలా రోడ్లమీద పడ్డారెందుకోనని .... నిజంగా ఆశ్చర్యంలోనే మునిగింది ప్రేక్షకలోకం.

ఏదైనా కేసు వుంటే ఎప్పటిలాగా మనల్ని పిలిచి వాళ్లకనుగుణంగా పనులు చేయించుకోక, అందరు ఎటోపోతారేం, యీ ధనవంతులూ, పెద్ద మనుషులూ ! :- అని ఆశ్చర్యపోయి తరువాత విసుక్కున్నారు గల్లీల చివరల్లో నిలబడ్డ .... రౌడీలు .... దాదాలు.

నినాదాలు లేవు డిమాండ్స్ తెలియజేసే బ్యానర్లు లేవు. ప్రొసెషన్ మొదట్లో ఒక ప్రముఖ వ్యక్తి ఒక చిన్న అట్ట పట్టుకున్నాడు. దాని మీద విషయాలు టైప్ చేయబడి వున్నాయి. ఆశయాలు - దూరంగా వున్న సామాన్య జనానికి కనపించకుండా వున్నాయ్. వాళ్లకోర్కెలు సామాన్య, జనానికి అందకుండా వున్నట్లు : ! అందుకే ఆశ్చర్యపోతున్నారంతా-ఎందుకు ? ఏమిటి ? - అని.

రకరకాల వాళ్ళు రకరకాల ఆశ్చర్యం -

కాని బిచ్చగాళ్ళకు ఆశ్చర్యం కలుగ లేదు, మొదట్లో

ఇలాంటి ఊరేగింపులు చూస్తూనే వున్నారు. ఈ రోజు ఊరేగింపువాళ్లకి కొత్తగా ప్రత్యేకంగా కన్పిస్తున్నది. అలాంటి ఊరేగింపు వెళ్ళే త్రోవలో కూర్చుంటే ఎవరో కొందరు దానం విసరే వారు ... దాంతో వాళ్ల కళ్ళు మెరిసేవి. కాని ఈ రోజు వాళ్ల దగ్గిరికే వెళ్ళ నివ్వడం లేదు. - పోలీసులు

ఒకరిద్దరు కుంటివాళ్ళు కుంటుతూ, మరో కుష్ఠరోగి తన చెక్రాలదెక్క మీదా, ఊరేగింపులోని వాళ్ల దగ్గరికి చేరుకోవాలని యత్నించారు. పోలీసుల లాఠీలు చెదర గొట్టాయి. మిగతా బిచ్చగాళ్ళు భయంతో .... అడ్డురాకుండా దారి విడిచారు. ఈ ఊరేగింపులో ఏదో గొప్పతనం వుందని తెల్సుకొని భయంగా, ఆశ్చర్యంగా ఉండిపోయారు. అనుకోకుండా తమంతటతామే అలాదూరంగా వెళ్ళి నిలుచోవడం తమనుతామే చంపుకున్నట్టుంది.

విలువైన సబ్బులతో స్నానంచేసి, ఖరీదైన క్రీములు పౌడర్లు, ఆయిల్స్ లిప్‌స్టిక్స్‌తో నాగరికత పెంచుకున్న ఊరేగింపు - వాళ్ళవైపు కళ్ళు చిట్లించుకుని, విసుక్కుంటూ, రుసరుసలాడుతూ వెళ్ళిపోతూనే వుంది తెల్లనికర్చీఫ్‌తో ముక్కుమూసుకుంటూ, మెత్తని జోళ్లమీద, బూట్లమీద, హైహీల్స్‌ల మీద.... చలవబట్టలతో, ఫారెన్ ఇంపోర్టెడ్ సారీస్‌తో, సూట్లతో....

ఎంతచెట్టుకు అంతగాలి, మనబాధలు మనకైతే, వాళ్ళవివాళ్ళకుంటాయి అని సరిపుచ్చుకునే మూర్ఖులు కొద్దిమందయితే - ఇదంతా ఎందుకు అని ప్రతి వానిలో ప్రశ్నలు అంటుకోవడమే ఎక్కువ,

ఊరేగింపు పోతూనే వుంది - మనుష్యుల్నితినే కొండచిలువలా.

మరునాడు అనేకభాషల పత్రికల్లో ఈవార్తగొప్పగా చోటుచేసుకుంది, అందులో ఆశ్చర్యమేముంటుంది?

* * *

హైదరాబాదు, జనవరి 1.

నగరంలోని పారిశుద్ధ్యాన్ని, అందాన్ని ప్రజల ఆరోగ్యాన్ని, ఆనందాన్ని దృష్టిలోవుంచుకుని ప్రముఖ నాయకులు, పారిశ్రామిక, వేత్తలు, వ్యాపారస్తులు సినీనటులు, యితర నగర ప్రముఖులు కలిసి ఒకటిరెండు ఫర్లాంగుల దూరం ఊరేగింపుగా పాదయాత్ర జరిపి, రాష్ట్ర గవర్నరుకు ఒక మెమొరాండం సమర్పించారు. అందులో - ఆనంద భరితమైన నగర జీవితంలో బిచ్చగాళ్లు, కుష్టివాళ్ళు, కుళ్ళిపోయి అసహ్యాన్ని రేపుతున్నారని, ఇది కాస్‌మోపాలిటన్ సిటీగనక, తరచు యితర దేశాలనుండి వచ్చేవాళ్ళు వీళ్ళనుచూసి మనగురించి, మన నాగరికత, సంస్కృతి, ఉన్నతి, ఔన్నత్యాన్ని గురించి తక్కువగా, నీచమైన అభిప్రాయాలకు వచ్చే ఆస్కారం వుంది గనక - వీళ్లను ఫుట్‌పాత్‌ల

నుండి నగరపార్కుల నుండి సినిమాహాళ్ళ దేవాలయాల పరిసరాల నుండి అంతటా బహిష్కరించాలని - తెలియజేశారు.

పిచ్చికుక్కల్ని మున్సిపాలిటీ వాళ్ళుపట్టుకుని తీసుకుపోయినట్లు - వీళ్ళ కూడా ఒకపద్ధతిని తక్షణమే అమలు జరపాలని వారు చాలా తీవ్రంగా అందులో విన్నవించుకున్నారు. ఇది కేవలం మానవతా విలువల్ని దృష్టిలో పెట్టుకుని....

ఆ న్యూస్‌పేపరు పర్రున చిరిగిపోయింది——

విద్యార్థినాయకుని ఉద్రేకపు చేతుల్లో పేపరుముక్కలు ముక్కలయింది అతని ఊపిరిబరువైంది. అతని ఆలోచనలో కరెంటుసుళ్ళుతిరిగింది - విద్యార్థులు యువజనులు ఐకమత్యం నీడలో ఆలోచించారు. బిచ్చగాళ్ళకు కుక్కల్లా పట్టుకు పోవాలని అన్నందుకు నిరసనగాబంద్ జరిపారు. నిముషాలమీద వార్త నగరం దాటి జిల్లాలకి, తాలూకాలకి పాకింది. పరిస్థితి తీవ్రంగా అయ్యింది. కర్ఫ్యూలు, ఫైరింగ్‌లు అయ్యాయి. ఎందరుచచ్చినా అధికార, ప్రకటనలో చచ్చినవాళ్ళ సంఖ్య మూడు - నాలుగు దాటలేదు, ఈ విషయంలో పార్టీలు తలదూర్చాయి. సమస్య రాజకీయంగా రంగుమార్చుకుంది. సామాన్యుడు స్తంభించిన జీవనంతో బతకలేకపోయాడు. సందుదొరికిందని మంత్రులు కొందరు రాజీనామాచేశారు. కొందరు పార్టీలుమార్చారు. ఎంతవెదికినా నోట్లో మాటలేనివాడు గూడా, పత్రికా ప్రకటన లిచ్చాడు. దినదినాభివృద్ధి చెంది సమస్య బలిసిపోయి నిగనిగలాడేట్లు కొందరు ఏంతో జాగ్రత్త తీసుకున్నారు. ఫలితంగానే క్రమంగా దేశం తేల్చుకో వాల్సిన అత్యవసర సమస్య అయింది.

దరిద్రులయినా, బిచ్చగాళ్ళయినా మనిషిని మనిషిగా చూడలేనిసమాజం గూర్చి తీవ్రంగా ఆలోచించారు మేధావులు. వారికి అది ఎంతోహీనంగాతోచింది-

ప్రభుత్వం మేధావులతో ఒక కమీషన్‌వేసింది అది -

"అసలు బిచ్చగాళ్ళంటే ఎవరు?

ఎందుకు బిచ్చగాళ్ళు?

రోడ్లమీద కనబడగానే లాగిపారేసే అవసరం వుందా?-" అని

బిచ్చగాళ్ళు ఆర్థికంగా, సాంఘికంగా, నైతికంగా అనేక రకాలుగా వుంటారు. గనక. ఆ కమీషను ఒక విషయం తేల్చింది –

"దేశంలో బిచ్చగాడు కానివాడు ఎవడూలేడు - అందువల్ల ఊరేగింపు తీసిన? నైతికంగా దిగజారిన - ప్రముఖ బిచ్చగాళ్ల నందర్నీ, సమాజపు కోరల చాటున దాగిన విషపుబుడ్డల నందర్నీ వారి వారి రంగాలనుండి వెంటనే బహిష్కరించాలి...... అని!

1974

—